పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా । తిరుపతి । చిత్తూరు । వై.ఎస్.ఆర్. కడప



# నకిలీ పెట్టుబడి యాప్‌లతో జాగ్రత్త--
## 1930కు వెంటనే ఫిర్యాదు చేయాలి--

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ ఆగస్టు 19:**
తక్కువ సమయంలో డబ్బులు రెట్టింపు, ఐదు రెట్లు అవుతాయని ఆశ చూపే నకిలీ పెట్టుబడి, టాస్క్ యాప్‌లను నమ్మవద్దని నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ సూచించారు. వాట్సాప్, టెలిగ్రామ్ తదితర సామాజిక మాధ్యమాల్లో వచ్చే పెట్టుబడి ఆఫర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.మొదట చిన్న మొత్తాలు చెల్లించి నమ్మకం కలిగించి, అనంతరం భారీ మొత్తాలు పెట్టుబడి పెట్టేలా చేసి మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. విత్‌డ్రా సమయంలో పన్ను, ఫీజు పేరుతో మరిన్ని డబ్బులు వసూలు చేసే అవకాశం ఉందన్నారు.తెలియని యాప్‌లు, ఏపీకే ఫైళ్లు, లింక్‌లను డౌన్‌లోడ్ చేయవద్దని, ఓటీపీ, యూపీఐ పిన్, ఏటీఎం పిన్, సీవీవీ వంటి వివరాలను ఎవరికీ చెప్పవద్దని సూచించారు.సైబర్ మోసానికి గురైన వెంటనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు. మోసానికి సంబంధించిన ఫోన్ నంబర్లు, చాట్‌లు, స్క్రీన్‌షాట్లు, బ్యాంకు లావాదేవీల వివరాలను భద్రపరచుకోవాలన్నారు.అత్యాశకు లోనుకాకుండా పెట్టుబడులకు ముందుగా సంస్థ విశ్వసనీయత, చట్టబద్ధతను పరిశీలించాలని ఎస్పీ సూచించారు.

# ఆహార నాణ్యతలో రాజీ వద్దు.. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

## పరిశుభ్రత, నాణ్యతపై ప్రత్యేక దృష్టి..
## కల్తీ పదార్థాల వినియోగంపై హెచ్చరిక

**తిరుపతి, ఆగస్టు 19 (పెన్ పవర్):**
తిరుపతి బస్టాండ్‌లోని స్టాళ్లు, హోటళ్లలో ఆహార నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఆహార భద్రత అధికారులు స్పష్టం చేశారు. తిరుపతి ఏటీఎం కార్యాలయంలో బస్టాండ్ స్టాల్ కాంట్రాక్టర్లతో నిర్వహించిన సమావేశంలో ఆహార భద్రతకు సంబంధించి పలు కీలక సూచనలు చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఆహార భద్రత, ప్రమాణాల చట్టం గురించి, ఆహార నాణ్యత పాటించకపోతే విధించే శిక్షలపై అధికారులు అవగాహన కల్పించారు. ప్యాకేజీ ఆహార పదార్థాలపై తయారీదారుడి వివరాలు, ఆహార భద్రతా సంస్థ అనుమతి సంఖ్య, తయారీ తేదీ, గడువు తేదీ, గరిష్ట చిల్లర ధర వంటి వివరాలు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ప్రతి దుకాణంలో ఆహార భద్రతా లైసెన్సును స్పష్టంగా ప్రదర్శించాలని సూచించారు.స్టాల్, హోటల్ పరిసరాలతో పాటు వంటగదిని ప్రతిరోజూ శుభ్రంగా ఉంచాలని, బొద్దింకలు, ఇతర కీటకాలు లేకుండా వారానికి ఒకసారి పురుగుల నియంత్రణ చర్యలు చేపట్టి, సంబంధిత ధ్రువపత్రాలను భద్రపరచుకోవాలని సూచించారు. వారానికి ఒకసారి పూర్తిస్థాయి శుభ్రపరిచే కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు.చట్నీ, కారం వంటి పదార్థాలను ఫ్రిజ్‌లో నిల్వ చేయకుండా తాజాగా తయారు చేసి వినియోగించాలని తెలిపారు. పాడైన కాలీఫ్లవర్ వంటి కూరగాయలను ఉపయోగించరాదని, ఆహార పదార్థాల్లో కృత్రిమ రంగులు, అజినమోటో వాడరాదని స్పష్టం చేశారు. టమాటా అన్నం, నిమ్మ అన్నం, పుదీనా అన్నం, గోబీ వంటి ఆహార పదార్థాల్లోనూ ం ు ం ు ు ల ు కలవరాదన్నారు. హోటళ్లలో తాగునీరు పరిశుభ్రంగా ఉండాలని, నీటి పాత్రలు, నిల్వ ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని సూచించారు. రొట్టె, పరోటా ప్యాకెట్లను నాణ్యమైన బ్రాండ్లవే ఉపయోగించాలని, ముందుగానే సగం ఉడికించి నిల్వ చేయకుండా అవసరానికి అనుగుణంగా తాజాగా తయారు చేసి అందించాలని తెలిపారు.సాస్, సోడా తదితర పదార్థాలను కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా రసీదులు తీసుకుని భద్రపరచుకోవాలని సూచించారు. నాణ్యమైన టీ పొడినే వినియోగించాలని, నాసిరకం లేదా బహిరంగంగా విక్రయించే టీ పొడితో టీ తయారు చేయరాదని తెలిపారు. టీ పొడిలో ఎలాంటి రంగులు కలపరాదని హెచ్చరించారు.వంట నూనెను రెండుసార్లకు మించి వేయించడానికి వినియోగించరాదని అధికారులు సూచించారు. ఉపయోగించిన వంట నూనెను సేకరించే వారికి విక్రయించి, సరైన విధంగా తొలగించాలని తెలిపారు. వేడి ఆహారం కనీసం 60 డిగ్రీల ఉష్ణోగ్రతలో ఉండేలా వేడి నిల్వ పరికరాలను ఉపయోగించాలని, చల్లబడిన ఆహారాన్ని విక్రయించరాదని స్పష్టం చేశారు. సమోసాలను వేడి పరికరాల్లో ఉంచి మాత్రమే వినియోగదారులకు అందించాలని సూచించారు. ముడి పదార్థాలను బహిరంగంగా ఉంచకుండా మూత ఉన్న




పాత్రల్లో భద్రపరచాలని తెలిపారు. ముందుగా వచ్చిన సరుకును ముందుగా వినియోగించే విధానాన్ని, గడువు తేదీ ముందుగా ముగిసే సరుకును ముందుగా వినియోగించే విధానాన్ని తప్పనిసరిగా పాటించాలన్నారు. ఫ్రిజ్‌ను కూడా పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.ఆహారాన్ని వడ్డించే సిబ్బంది తల టోపీలు, చేతి తొడుగులు, ఏప్రాన్లు ధరించాలని అధికారులు ఆదేశించారు. ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందించడంలో స్టాల్ నిర్వాహకులు పూర్తి బాధ్యత వహించాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో ఆహార భద్రత నియంత్రణ అధికారి జి. వెంకటేశ్వరరావు, ఆహార భద్రత అధికారి ఆర్. జగదీష్, డిపో మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.నిబంధనలు పాటించని స్టాళ్లపై తనిఖీల సందర్భంగా చర్యలు తీసుకుంటామని, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు అవసరమైన చట్టపరమైన చర్యలు చేపడతామని అధికారులు హెచ్చరించారు.

# ఓటర్ల అభ్యంతరాలపై
## కలెక్టర్ వెంకటేశ్వర్ క్షేత్రస్థాయి పరిశీలన



**ఓజిలి, పెన్ పవర్ ఆగస్టు 19 :**
తిరుపతి జిల్లా ఓజిలి మండలంలో ప్రత్యేక సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్)లో భాగంగా ఓటర్ల జాబితాపై వచ్చిన అభ్యంతరాలు, వినతుల పరిశీలన ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ బుధవారం క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. సూళ్లూరుపేట నియోజకవర్గం పరిధిలోని గ్రద్దగుంట గ్రామంలో జరుగుతున్న పరిశీలన ప్రక్రియను ఆయన పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి చేపడుతున్న చర్యలను కలెక్టర్ సమీక్షించారు. ఓటర్ల నుంచి అందిన అభ్యంతరాలు, వినతులను నిబంధనల మేరకు సమగ్రంగా పరిశీలించి, అర్హత ఆధారంగా నిష్పక్షపాతంగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా జరిగేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. అర్హులైన ప్రతి ఓటరుకు జాబితాలో స్థానం కల్పించేలా, అనర్హులైన వివరాలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునేలా ప్రక్రియను పర్యవేక్షించాలని తెలిపారు.కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి వి. దేవేంద్ర రెడ్డి, ఓజిలి తహసీల్దార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# సాకం శశికళ ఆకస్మిక మృతి






**తిరుపతి, పెన్ పవర్, ఆగస్టు 19:**
తెలుగు భాషోద్యమ సమితి వ్యవస్థాపకులు, రచయిత, విశ్రాంత తెలుగు అధ్యాపకులు సాకం నాగరాజు సతీమణి సాకం శశికళ అనారోగ్యంతో బుధవారం వేకువజామున తుదిశ్వాస విడిచారు. ఆమె మృతి పట్ల తెలుగు సాహితీ, భాషాభిమానులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి, సంతాపం వ్యక్తం చేశారు.
బుధవారం మధ్యాహ్నం తిరుపతి కరకంబాడి రోడ్డులోని గోవిందధామంలో కుటుంబ సభ్యులు శశికళ అంత్యక్రియలను నిర్వహించారు. అంతకుముందు వరదరాజనగర్‌లోని వారి స్వగృహంలో ఉంచిన పార్థివదేహానికి నగరానికి చెందిన పలువురు ప్రముఖులు, రచయితలు, భాషాభిమానులు అశ్రు నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా డాక్టర్ భారతి, రోజారాణి, అమరా హాస్పిటల్స్ అధినేత రమాదేవి గౌరినేని, మాజీ శాసనమండలి సభ్యులు కత్తి నరసింహారెడ్డి, యండపల్లి శ్రీనివాసులురెడ్డి, తిరుపతి జిల్లా రచయితల సంఘం ప్రతినిధులు భూమన్, శైలకుమార్, తోట వెంకటేశ్వర్లు, మన్నవ గంగాధర ప్రసాద్, వాకా ప్రసాద్, గాలి గుణశేఖర్, పేరూరు బాలసుబ్రమణ్యం, టెంకాయల శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.అలాగే అరసం ప్రతినిధులు యువశ్రీ మురళి, నెమిలేటి కిట్టన్న, రచయితలు ఆర్.సి.కె. రాజు, గజేంద్రరెడ్డి, విశ్వనాథరెడ్డి, తెలుగు భాషోద్యమ సమితి ప్రతినిధులు తమటం రామచంద్రారెడ్డి, ఆకుల మల్లేశ్వరరావు, శంకరంబాడి సాహితీ పీఠం ప్రతినిధి మస్తానమ్మ, ఈసలాపురం బాలసుబ్రమణ్యం, హరీష్ తదితరులు శశికళకు నివాళులర్పించారు.

**పలువురు సంతాపం**

శశికళ మృతి పట్ల సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కే. నారాయణ, సీపీఐ జాతీయ కార్యదర్శి కే. రామకృష్ణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి. హరినాథ్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, జిల్లా కార్యదర్శి మురళి, అన్నమయ్య జిల్లా సీపీఐ మాజీ కార్యదర్శి పి.ఎల్. నరసింహులు, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, కే. రాధాకృష్ణ, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.అభ్యుదయ వేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గురవయ్య, ఎం.డి. ప్రసాద్, టి.హెచ్.పీ.ఎస్. జిల్లా కార్యదర్శి చిన్నం కాలయ్య, జిల్లా పార్టీ సమితి సభ్యులు డి. రామచంద్రయ్య, గోవిందస్వామి, శ్రీరాములు, కే.వై. రాజా, బాదుల్లా, డాక్టర్ జనార్దన్, డాక్టర్ ప్రసాద్ తదితరులు శశికళ కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలియజేశారు.

# వైఎస్సార్‌సీపీ నేత వివాహ వేడుకలో నూకతోటి రాజేష్





**నాగలాపురం, పెన్ పవర్ ఆగస్టు 19:**
నాగలాపురం మండలం వినోబానగర్ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత, వార్డు మెంబర్ చిరంజీవి అక్క కుమారుడి వివాహ వేడుక సోమవారం నాగలాపురంలోని టీఆర్ఆర్ కళ్యాణ మండపంలో ఘనంగా జరిగింది.
ఈ వివాహ వేడుకకు సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ స్థానిక పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో కొనసాగాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

# చిన్న పత్రికల జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి





**పుట్టపర్తి పెన్ పవర్, ఆగస్టు 19:**
ఆంధ్రప్రదేశ్‌లో మధ్యతరహా, చిన్న పత్రికల్లో పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ రాయలసీమ జిల్లాల ఇన్‌చార్జ్ కవరకుంట్ల జయరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రేపటి రామాంజినేయులు డిమాండ్ చేశారు.అనంతపురం నగరంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ మధ్యతరహా, చిన్న దినపత్రికలు, పీరియాడికల్స్ జర్నలిస్ట్ అసోసియేషన్ అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల నూతన కమిటీల ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకుల ఆధ్వర్యంలో కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అనంతపురం డీఎస్పీ చంద్రశేఖర్ జర్నలిస్ట్ అసోసియేషన్ లోగోను ఆవిష్కరించారు. విశిష్ట అతిథులుగా ఏపీడబ్ల్యూజేఎఫ్ రాయలసీమ జిల్లాల ఇన్‌చార్జ్ కవరకుంట్ల జయరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రేపటి రామాంజినేయులు పాల్గొని ప్రసంగించారు.
ఈ సందర్భంగా రేపటి రామాంజినేయులు మాట్లాడుతూ చిన్న, మధ్యతరహా పత్రికల పరిరక్షణతో పాటు వాటిలో పనిచేస్తున్న జర్నలిస్టుల హక్కుల సాధన కోసం సంఘం కృషి చేస్తుందన్నారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం నిరంతరం పోరాడతామని తెలిపారు.నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం విడుదల చేసే ప్రకటనల్లో మధ్యతరహా, చిన్న, ఇతర పత్రికలకు 30 శాతం వాటా కల్పించాలని కోరారు. పత్రికల ఎంపానెల్‌మెంట్ సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రభుత్వ కార్యక్రమాలు, వార్తల కవరేజీలో చిన్న, మధ్యతరహా పత్రికలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

**శ్రీ సత్యసాయి జిల్లా కమిటీ**

జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ఎన్. నారాయణ, అధ్యక్షుడిగా బి. రవీంద్రనాయక్, ప్రధాన కార్యదర్శిగా కే.ఎన్. నాగరాజు, ఉపాధ్యక్షులుగా సాకే శ్రీనివాసులు, కోలా బ్రహ్మయ్య, జాయింట్ సెక్రెటరీగా పి. మల్లిక, కోశాధికారిగా పి. మహబూబ్ బాషాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.
కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ గౌరవ అధ్యక్షుడు తలారి రామాంజనేయులు, జిల్లా నాయకులు డాక్టర్ సూర్య, సీనియర్ జర్నలిస్టులు ఆజాద్, సుబ్బయ్య, శంకరప్రసాద్, బాబ్జాన్, సురేష్, శ్రీరాములు, ఓ. భాస్కర్, డాక్టర్ ఉద్దండం చంద్రశేఖర్, రామ్మూర్తి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పెన్నా నగర్‌లో గంజాయి నిర్మూలనపై అవగాహన




**ప్రొద్దుటూరు, పెన్ పవర్ ఆగస్టు 19 :**
వైఎస్సార్ కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు ప్రొద్దుటూరు వన్‌టౌన్ సీఐ వెంకట కొండారెడ్డి ఆధ్వర్యంలో పెన్నా నగర్‌లో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీసుల ఈగల్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పోలీసు అధికారులు గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాలకు ఆకర్షితులు కాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు కుటుంబ, సామాజిక జీవితంపై తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు.గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిసినట్లయితే వెంటనే పోలీసులకు తెలియజేయాలని అధికారులు కోరారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు.సీఐ వెంకట కొండారెడ్డి మాట్లాడుతూ మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణం కోసం పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు తల్లిదండ్రులు, విద్యార్థులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# మహిళలకు ఉచిత కారు డ్రైవర్ శిక్షణ



**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఆగస్టు 19.**
మహిళలకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఉచితంగా కార్ డ్రైవింగ్ శిక్షణ అందిస్తున్నామని డిఆర్డిఏ పిడి నాగరాజకుమారి చెప్పారు. బుచ్చి మండలంలోని వెలుగు కార్యాలయంలో ఏపీఎం శ్రీధర్ ఆధ్వర్యంలో మహిళలకు కార్ డ్రైవింగ్ శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమెమాట్లాడుతూ. కార్ డ్రైవర్లకు మంచి డిమాండ్ ఉండడంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. జిల్లాలో మొట్టమొదట బుచ్చిరెడ్డిపాలెం నుండి శ్రీకారం చుట్టామన్నారు. మహిళలు శిక్షణ పొందేందుకు ఎంత ఉత్సాహం చూపుతున్నారని తెలిపారు. నెలపాటు శిక్షణ జరుగుతుందని అనంతరం పరీక్ష పెట్టి సర్టిఫికెట్ అందజేసి డ్రైవింగ్ లైసెన్స్ కోసం ప్రోసెసింగ్ చేస్తామన్నారు. స్వయంగా వాహనాలు నడిపే సామర్థ్యం కలిగిన మహిళలకు వాహనాలు కొనుగోలుకు బ్యాంకుల ద్వారా రుణాలు అందిస్తామన్నారు.

# శ్రవణ లోపంతో బాధపడుతున్న నిరుపేద కార్మికుడికి శ్రవణ యంత్రం (హియరింగ్ ఎయిడ్) అందజేత




**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ ఆగస్టు 19**
స్పందించి సాయం అందించిన టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.ఎం.డి ఫిరోజ్, విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ చైర్మన్ నారాయణ స్వామి నంద్యాల పట్టణంలోని రాజ్ టాకీస్ సమీపంలో గల రజాక్ ఏజెన్సీస్ సైకిల్ షాపులో పనిచేస్తున్న నూర్ ఖాజా అనే నిరుపేద కార్మికుడికి శ్రవణ లోపం ఉన్నట్లు తెలుసుకున్న నంద్యాల జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి ఎన్.ఎం.డి. ఫిరోజ్ తక్షణమే స్పందించారు. నూర్ ఖాజా తీవ్రమైన వినికిడి సమస్యతో ఇబ్బంది పడుతున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకురాగా, మానవతా దృక్పథంతో ఫిరోజ్ ఈ విషయాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ చైర్మన్ నారాయణ స్వామి దృష్టికి తీసుకెళ్లారు. చైర్మన్ నారాయణ స్వామి సహకారంతో వెంటనే నూర్ ఖాజా కు అవసరమైన ఉచిత శ్రవణ యంత్రాన్ని (హియరింగ్ ఎయిడ్) మంజూరు చేయించారు. ఈ రోజు నంద్యాల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నూర్ ఖాజాకు ఈ శ్రవణ యంత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా బాధితుడు నూర్ ఖాజా మాట్లాడుతూ తన సమస్యను విని స్పందించి, వినికిడి యంత్రాన్ని అందించేందుకు సహకరించిన టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.ఎం.డి ఫిరోజ్ , రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ చైర్మన్ నారాయణ స్వామి కి హృదయపూర్వక కృతజ్ఞతలు




తెలియజేశారు. నిరుపేదల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్న టీడీపీ నాయకత్వానికి రుణపడి ఉంటానని పేర్కొన్నారు.

# జిల్లా విద్యాశాఖ అధికారి జనార్ధన్ రెడ్డిని డి.ఇ.ఓ గా తప్పించండి

## సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు డిమాండ్



**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ ఆగస్ట్ 19**

నంద్యాల జిల్లా విద్యాశాఖ అధికారి పి.జనార్ధన రెడ్డి కర్నూలు డైట్ కళాశాఖలో( ఎఫ్.ఏ. సి) ప్రిన్సిపాల్ ఉంటూ, నంద్యాల జిల్లా డిఇఓ గా కూడా( ఎఫ్.ఏ.సి ) బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈయన బాధ్యతలు తీసుకొన్న తరువాత జిల్లా కలెక్టర్ కి అనిగి మణిగి ఉంటూ , ప్రవేటు-కార్పొరేట్ శక్తులను తన వెంటవేడుకొని తిరుగుతూ పర్యవేక్షణను గాలికి వదలి జల్సాలు చేసుకొంటూ స్టేటస్ లో ఫొటోలో అప్లోడ్ చేస్తూ కాలం గడుపుచున్నారు. ఎయిడెడ్ ఉపాధ్యాయుల నుయామకంలోను,సైన్స్ ఫేర్,తెలుగు మహా సభలు,ఆండుదాం ఆంధ్ర, దూర విద్యా విధానలోను అందినకాటికి దోచుకొంటు ఎవరైనా టీడీపీ వారు ప్రశ్నిస్తే తాను టీడీపీ వాడినే,ఎవరైనా వైసీపీ వారు ప్రశ్నిస్తే తాను వైసీపీ వాడినే అంటూ ఏ ఎండకు ఆగొడుగు పట్టడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య! డిఇఓ జనార్ధన రెడ్డి ఘూనా కార్యాలను గురించి గత మూడు రోజుల్లోగా ప్రముఖ దిన పత్రికలో వరుస కథనాలను సుమోటోగా స్వీకరించి తగు చర్యలు తీసుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ నంద్యాల జిల్లా సమితి కార్యదర్శి ఎన్. రంగనాయుడు డిమాండ్ చేశారు. ఎందుకంటే ఈయన కూడా పత్రికలలో వచ్చిన వార్తలను ఆధారంగా చేసుకొని ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ తిరిగి మూడవ కంటికి తెలియకుండా డబ్బులు తీసుకొని సస్పెన్షన్ లను తొలగిస్తున్నట్లు అందరికి తెలుసు. ఇలాంటి అవినీతి అధికారి పై విచారణ నిర్వహించి సస్పెండ్ చేయాలనీ డిమాండ్ చేసారు

# విద్యార్థులతో వాటర్ క్యాన్లు మోయించిన ప్రధానోపాధ్యాయుడు..

## చర్యలు తీసుకోవాలని డిమాండ్

**ధర్మవరం, పెన్ పవర్ ఆగస్టు 19 :**

విద్యార్థులతో వాటర్ క్యాన్లు మోయించిన ధర్మవరం శివానగర్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిపై కఠిన చర్యలు తీసుకొని సస్పెండ్ చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ధర్మవరం ఆర్డీఓ రాంభూపాల్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా పీఎస్‌యూ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర, ఏఐఎస్యూ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు కనుమ దామోదర్ మాట్లాడుతూ.. శివానగర్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులతో సుమారు 500 మీటర్ల దూరంలో ఉన్న వాటర్ ప్లాంట్ నుంచి పాఠశాల వరకు వాటర్ క్యాన్లు మోయించిన ఘటన వెలుగులోకి వచ్చిందన్నారు. విద్యార్థులు పుస్తకాలు పట్టుకుని తరగతి గదుల్లో విద్యను అభ్యసించాల్సిన సమయంలో వారితో బరువైన వాటర్ క్యాన్లు మోయించడం తీవ్ర అభ్యంతరకరమని పేర్కొన్నారు.

విద్యార్థులను విద్యాబోధనకు సంబంధించిన కార్యకలాపాలకే పరిమితం చేయాల్సి ఉండగా, పాఠశాల నిర్వహణకు సంబంధించిన బోధనేతర పనుల్లో వినియోగించడం వారి విద్యా హక్కులను దెబ్బతీయడమే కాకుండా శారీరక భద్రతకు కూడా ప్రమాదకరమని వారు అన్నారు. చిన్నారులతో నీటి క్యాన్లు మోయించడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, విద్యార్థుల ఆరోగ్యం, భద్రత విషయంలో పాఠశాల యాజమాన్యం మరింత బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని తెలిపారు.






గతంలోనూ ఫిర్యాదులు చేసినా చర్యలు లేవని ఆరోపణ

సదరు ప్రధానోపాధ్యాయుడి విధులపై గతంలో కూడా విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదులు చేసినట్లు విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. అయితే ఫిర్యాదులపై సమగ్రంగా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని ఆరోపించారు. విద్యార్థులతో పనులు చేయిస్తున్నారనే ఆరోపణలపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా తక్షణమే స్పందించాలని కోరారు.

<u>ఉన్నతస్థాయి విచారణ జరపాలి</u>

విద్యార్థులతో వాటర్ క్యాన్లు మోయించిన ఘటనపై ఉన్నతస్థాయి అధికారులతో సమగ్ర విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు. ఘటనకు సంబంధించిన వాస్తవాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రధానోపాధ్యాయుడి పాత్రపై విచారణ జరిపి, ఆరోపణలు నిజమని తేలితే సస్పెండ్ చేయడంతో పాటు శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్డీఓకు సమర్పించిన వినతిపత్రంలో కోరారు.

<u>విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి</u>

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సురక్షితమైన, గౌరవప్రదమైన విద్యా వాతావరణం కల్పించడం అధికారుల బాధ్యత అని విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొన్నారు. పాఠశాలల్లో విద్యార్థులను బోధనేతర పనులకు వినియోగించకుండా సంబంధిత అధికారులు పర్యవేక్షణను పెంచాలని కోరారు.

విద్యార్థుల హక్కులు, భద్రత విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని మంజుల నరేంద్ర, కనుమ దామోదర్ హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

# విధులు నిర్వహించమంటే డాక్టర్ పై నిందలు



**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఆగస్టు 19.**

జొన్నవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ అహ్మద్‌పై ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి పెనుబల్లి గ్రామ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శివప్రియ చేసిన ఆరోపణలను పీహెచ్‌సీ సిబ్బంది ముక్తకంఠంతో ఖండించారు.

బుధవారం విధులు ముగించుకున్న అనంతరం ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు విలేకరుల సమావేశం నిర్వహించారు. పెనుబల్లి సబ్ సెంటర్‌కు చెందిన అరుణమ్మ, నాగమ్మ, కల్పన, సుజాత తదితరులు మాట్లాడుతూ... శివప్రియ ఎంఎల్‌హెచ్‌పీగా చేయాల్సిన వైద్య సేవలను సక్రమంగా నిర్వహించకుండా, తమతో పనులు చేయించేవారని ఆరోపించారు. ప్రశ్నించిన సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించడంతో పాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి ఉద్యోగాలు లేకుండా చేస్తానని బెదిరించేదని పేర్కొన్నారు.డాక్టర్ అహ్మద్ మాత్రం విధులకు సంబంధించి సూచనలు, సలహాలు ఇచ్చేవారే తప్ప వ్యక్తిగతంగా ఎవరినీ వేధించలేదని సిబ్బంది స్పష్టం చేశారు. తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్తే పరిష్కరించేవారని తెలిపారు. డాక్టర్ అహ్మద్‌పై చేసిన ఆరోపణలను ఖండిస్తూ, ఈ విషయాన్ని ఎక్కడైనా చెప్పేందుకు తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఇప్పటికే విచారణ అధికారులకు వినతిపత్రం అందజేసినట్లు సిబ్బంది తెలిపారు.

## నంద్యాల 36వ వార్డులో ఇంటింటికీ తెలుగుదేశం

# మహిళలకు అండగా కూటమి ప్రభుత్వం ఎన్. ఎం. డి ఫిరోజ్

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ ఆగస్టు 19**

నంద్యాల పట్టణంలోని 36వ వార్డు రామకృష్ణ స్కూల్ వద్ద వార్డు ఇంచార్జ మారుతీ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన "ఇంటింటికీ తెలుగుదేశం" డోర్ టు డోర్ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ ఎం డి ఫిరోజ్, విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ చైర్మన్ గడుపాటి నారాయణ స్వామి పాల్గొన్నారు.ఈ సందర్భంగా వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను, లబ్ధిదారులను నేరుగా కలుసుకుని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వాటి ద్వారా ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను వివరించారు. అలాగే ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. స్త్రీ శక్తి పథకం విజయవంతంగా కొనసాగుతున్న సందర్భంగా వార్డులోని మహిళలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఉచిత బస్సు ప్రయాణం ద్వారా మహిళలకు కలుగుతున్న ప్రయోజనాలను నేరుగా వారిని అడిగి తెలుసుకున్నారు. మహిళలు ఈ పథకం ద్వారా తమకు కలుగుతున్న ప్రయోజనాలను వివరించి సంతోషం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎన్.ఎం.డి ఫిరోజ్ మాట్లాడుతూ "కూటమి ప్రభుత్వం మహిళా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత



ఇస్తోందన్నారు, అనేక సంక్షేమ పథకాలలో మహిళలను ప్రధాన లబ్ధిదారులుగా గుర్తించి, ఆర్థిక ప్రయోజనాలు నేరుగా వారి ఖాతాల్లో జమ చేసే విధంగా చర్యలు తీసుకుంటోంది. మహిళల ఆర్థిక స్వావలంబన, కుటుంబ ఆర్థిక భద్రతే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. మహిళలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ, వారి జీవితాల్లో ఆర్థిక భరోసా కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారుఈ కార్యక్రమంలో వార్డు ఇంచార్జ్ మారుతి ప్రసాద్, టీడీపీ నాయకులు నాగరాడోన సుధీర్, ఉదయ్ కుమార్, పుల్లయ్య, శేఖర్ రెడ్డి, వాసు, సునీల్ కుమార్, చంటి, దాసు, సాయికృష్ణ, శివ శంకర్, నూర్బాషా,రాఘువేంద్ర,టీడీపీ మహిళ నాయకురాలు వెంకటలక్ష్మి, మాధవి, మేరీ, సుజాత, జ్యోష్న, రాజేశ్వరి, మల్లిక, రాగిణి, పద్మ తదితరులు పాల్గొన్నారు

# గోస్పాడు మండలం వైఎస్ఆర్ సిపి నాయకులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి..



**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ ఆగస్టు 19**

నంద్యాల నియోజకవర్గం గోస్పాడు మండలంలోని జిల్లెల్ల గ్రామ వైసిపి నాయకులు చంద్రశేఖర్ రెడ్డి జనార్దన్ రెడ్డి లకు గత నెల బైక్ పై వెళుతూ ఆక్సిడెంట్ కావడం జరిగింది...

హాస్పిటల్ నందు చికిత్స పొంది నేడు జిల్లెల్ల గ్రామానికి చేరుకోవడంతో వారిని జిల్లెల్ల గ్రామంలో వారి నివాసంలో మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పరామర్శించడం జరిగింది...

# 34 శాతం బీసీ రిజర్వేషన్లపై సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన బీసీ నేత జువ్వలపాటి మస్తాన్...




**నాయుడుపేట, పెన్ పవర్, ఆగష్టు 19**

కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లను కల్పించిన నేపథ్యంలో సీఎం చంద్రబాబు కు సూళ్లూరుపేట నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు జువ్వలపాటి మస్తాన్ ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలియజేశారు.మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీ మొదటినుండి వెనకబడిన వర్గాలకు అండగా ఉందని జువ్వలపాటి మస్తాన్ తెలియజేశారు.గత తెలుగుదేశం పార్టీ హయాంలో 33 శాతం ఉన్న బీసీ రిజర్వేషన్లను గత వైసీపీ ప్రభుత్వం 24 శాతానికి తగ్గించి బీసీలకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తిరిగి కూటమి పాలనలో తెలుగుదేశం పార్టీ వెనకబడిన వర్గాలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించడం పై ఆయన హర్షం వ్యక్తం చేశారు.అలాగే తెలుగుదేశం పార్టీ హయాంలో బీసీలకు అనేక రకాల సంక్షేమ పథకాలు అందించాలని తెలియజేశారు.వెనకబడిన వర్గాల ప్రజలంతా తెలుగుదేశం పార్టీని ఆశీర్వదించి రానున్న స్థానిక ఎన్నికల్లో కూటమి పార్టీ అభ్యర్థులను గెలిపించాలని బీసీ నేత జువ్వలపాటి మస్తాన్ కోరారు.

# ఏళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షమం

- ఏళ్ల నమ్మకంఅభివృద్ధి, సంక్షేమం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలు ప్రభుత్వం దృష్టికి
- హౌస్‌హోల్డ్ స్ప్లిట్టింగ్ జరగక పేద కుటుంబాలు ప్రభుత్వ లబ్ధికి దూరమవుతున్నాయి
- కొడవలూరు మండలంలో రీసర్వే కారణంగా దాదాపు 400 ఎకరాలు ప్రభుత్వ భూమిగా నమోదైన అంశంపై పరిష్కారం కోరిన ఎమ్మెల్యే
- పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్నప్పటికీ భూముల రికార్డుల్లో మార్పులపై సమగ్ర పరిశీలనకు విజ్ఞప్తి



**నెల్లూరు పెన్ పవర్ ఆగస్టు 19.**

కోవూరు నియోజకవర్గంలోని ప్రజలు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలను కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి శాసనసభ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. వర్షాకాల అసెంబ్లీ సమావేశాల మూడో రోజు బుధవారం సభలో ప్రశాంతి రెడ్డి మాట్లాడారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న హౌస్ హోల్డ్ స్ప్లిట్టింగ్ (కుటుంబాల విభజన) కొడవలూరు మండలంలోని భూ సమస్యలను సభ దృష్టికి తెచ్చి తక్షణ పరిష్కారం చూపాలని కోరారు.

**ఇంటింటి ప్రచారంలో ప్రజా సమస్యల గుర్తింపు**

'2 ఏళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో పలు ప్రధాన సమస్యలు తమ దృష్టికి వచ్చాయని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు ఒక్కసారి కూడా హౌస్ హోల్డ్ స్ప్లిట్టింగ్ ప్రక్రియ జరగలేదని వివరించారు. ఒకే పెద్ద కుటుంబంలో ఉంటూ వివాహమైన పిల్లలు లేదా వేరుగా నివసిస్తున్న దంపతులను ప్రత్యేక కుటుంబంగా గుర్తించకపోవడం వల్ల చాలామంది పేదలు ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలను అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ అంశంపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించి హౌస్ హోల్డ్ స్ప్లిట్టింగ్‌కు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

కొడవలూరు మండలంలో రీసర్వే లొసుగుల పరిష్కారానికి విజ్ఞప్తి

కొడవలూరు మండల పరిధిలోని రైతు భూముల సమస్యను ఎమ్మెల్యే సభలో ప్రముఖంగా ప్రస్తావించారు. సుమారు 90 సంవత్సరాల క్రితం అక్కడ రైతులకు భూములు కేటాయించారని, వాటికి సంబంధించి పట్టాదారు పాసు పుస్తకాలు కూడా ఉన్నాయని గుర్తుచేశారు. అయితే, గత ఎన్నికల ముందు జరిగిన భూముల రీసర్వేలో తీవ్ర లొసుగులు చోటుచేసుకున్నాయని చెప్పారు. నాలుగు గ్రామాలకు చెందిన దాదాపు 400 ఎకరాల రైతుల భూములను రికార్డుల్లో 'ప్రభుత్వ భూమి'గా తప్పుగా నమోదు చేశారని తెలిపారు. ఇలాంటి భూ సమస్యలు ఒక్క కొడవలూరులోనే కాకుండా నియోజకవర్గవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో నమోదయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. తరతరాలుగా సాగు చేసుకుంటున్న రైతులకు రీసర్వే నిర్ణయాల వల్ల తీవ్ర అన్యాయం జరిగిందని, ప్రభుత్వం ప్రత్యేకంగా పరిశీలించి ఆయా భూములను తిరిగి రైతుల పేరిట నమోదు చేసి న్యాయం చేయాలని శాసనసభ ద్వారా ప్రభుత్వాన్ని కోరారు.

# విద్యుత్ బిల్ కలెక్టర్ల పోరాటం ఉధృతం

- 48 గంటల నిరాహార దీక్షలు విజయవంతం..
- నేటి నుంచి రిలే దీక్షలు
- సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాటం కొనసాగిస్తాం: సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి

**తిరుపతి, పెన్ పవర్ ఆగస్టు 19 :**

ఎస్పీడీసీఎల్ పరిధిలో పనిచేస్తున్న విద్యుత్ బిల్ కలెక్టర్ల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన 48 గంటల నిరాహార దీక్షలు విజయవంతంగా ముగిశాయి. సమస్య పరిష్కారం కోసం బుధవారం నుంచి కార్పొరేట్ కార్యాలయం ఎదుట జిల్లాల వారీగా రిలే నిరాహార దీక్షలు ప్రారంభించినట్లు సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి తెలిపారు.

ఈ నెల 17వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమైన 48 గంటల నిరాహార దీక్షలు బుధవారం ఉదయం 10 గంటలకు ముగిశాయి. ఎస్పీడీసీఎల్ పరిధిలోని తొమ్మిది జిల్లాలకు చెందిన బిల్ కలెక్టర్లు, వారి కుటుంబ సభ్యులు, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఏపీ బిల్ కలెక్టర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకటరమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కందారపు మురళి మాట్లాడుతూ.. సెప్టెంబర్ 1 నుంచి బిల్ కలెక్టర్లను విధుల నుంచి తొలగిస్తూ ఎస్పీడీసీఎల్ యాజమాన్యం ఏకపక్షంగా ఆదేశాలు జారీ చేయడం అమానవీయమన్నారు. సుమారు 35 సంవత్సరాలుగా సంస్థకు సేవలందించిన కార్మికులను కేవలం డిజిటలైజేషన్ పేరుతో ఉద్యోగాల నుంచి తొలగించడం సమంజసం కాదని పేర్కొన్నారు.సాంకేతిక మార్పుల కారణంగా ఉపాధి కోల్పోతున్న కార్మికులకు



ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వ రంగ సంస్థలపై ఉందన్నారు. ఎస్పీడీసీఎల్ ఉన్నతాధికారులతో చర్చలు జరిగినప్పటికీ సమస్య పరిష్కారంపై స్పష్టమైన హామీ లభించలేదని తెలిపారు.దీంతో 48 గంటల నిరాహార దీక్షల అనంతరం కార్పొరేట్ కార్యాలయం ఎదుట జిల్లాల వారీగా ప్రతిరోజూ రిలే నిరాహార దీక్షలు నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. బుధవారం ఉదయం 11 గంటల నుంచి రిలే నిరాహార దీక్షల శిబిరాన్ని ప్రారంభించామని, సమస్య పరిష్కారమయ్యే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు.వేల కోట్ల రూపాయల ఆదాయం కలిగిన డిస్కాంలో వందకు పైగా కుటుంబాలకు ఉపాధి కల్పించడం పెద్ద సమస్య కాదని మురళి అన్నారు. ఐదేళ్ల చిన్నారుల నుంచి వృద్ధుల వరకు బిల్ కలెక్టర్ల కుటుంబ సభ్యులు దీక్షల్లో పాల్గొనడం వారి ఆవేదనకు నిదర్శనమన్నారు.రాష్ట్రంలో సాంకేతిక విప్లవం తీసుకొస్తూ పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్న నేపథ్యంలో.. ప్రభుత్వ రంగ సంస్థలో సాంకేతిక మార్పుల కారణంగా ఉపాధి కోల్పోతున్న కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి ఎందుకు కల్పించరని ఆయన ప్రశ్నించారు. ఎస్పీడీసీఎల్ యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి బిల్ కలెక్టర్ల సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో ఏపీ బిల్ కలెక్టర్స్ యూనియన్ నాయకులు ఎం.వి.శ్రీనివాసులు, అశోక్, రమేష్, సునీల్, రత్నశేఖర్, బాప్‌జాన్, నూర్, శేషాద్రిరావు, నరసింహులు, రాకేష్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో బిల్ కలెక్టర్లు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# ఉద్యోగాల హామీలు ఏమయ్యాయి?

**నిరుద్యోగ యువతకు మోదీ, చంద్రబాబు సమాధానం చెప్పాలి**
**వాలంటీర్లను వెంటనే కొనసాగించాలి.. ఖాళీ పోస్టుల్లో అవకాశం కల్పించాలి**
**ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సకల రాజా డిమాండ్**



**శ్రీ సత్యసాయి జిల్లా, పెన్ పవర్ ఆగస్టు 19 :**
ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతకు ఇచ్చిన ఉద్యోగ హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే అమలు చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి సకల రాజా డిమాండ్ చేశారు. ఉద్యోగాల పేరుతో యువతను నమ్మించి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు హామీల అమలులో నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆయన విమర్శించారు.

బుధవారం శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు. అనంతరం డీఆర్ఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి, గత 12 ఏళ్లుగా నిరుద్యోగ యువతను నిరాశకు గురిచేస్తోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఉద్యోగ హామీలను అమలు చేయకుండా నిరుద్యోగ సమస్యను మరింత తీవ్రతరం చేస్తున్నారని విమర్శించారు.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్నా నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని ఏఐవైఎఫ్ నాయకులు పేర్కొన్నారు. ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ ప్రకటించి రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, ఉద్యోగం లభించే వరకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి అందిస్తామని ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

వాలంటీర్ల సమస్యను కూడా ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఎన్నికల ముందు వాలంటీర్లను కొనసాగించి నెలకు రూ.10 వేల గౌరవ వేతనం ఇస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన అనంతరం వేలాది మంది వాలంటీర్లను విధుల నుంచి తొలగించిందని నాయకులు ఆరోపించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల ఇంటి ముంగిటకు చేర్చడంలో, ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించడంలో వాలంటీర్లు కీలక పాత్ర పోషించారని తెలిపారు.

కరోనా మహమ్మారి సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజలకు సేవలందించిన వాలంటీర్ల సేవలను ప్రభుత్వం విస్మరించడం అన్యాయమని పేర్కొన్నారు. వాలంటీర్లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, అది సాధ్యం కాకపోతే వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో వారి సేవలు, అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.


కేంద్రంలో మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలో చంద్రబాబుపవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలపై స్పష్టమైన సమాధానం చెప్పాలని ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువత, వాలంటీర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో వాలంటీర్లు, నిరుద్యోగ యువత, ఏఐవైఎఫ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రంథాలయాల అభివృద్ధికి నిర్ణయాలు అభినందనీయం

# గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ భీమినేని వందనా దేవి

**గుంటూరు, పెన్ పవర్, ఆగస్ట్, 19,**
గ్రంథాలయ సెస్ నిధులను నేరుగా జిల్లా గ్రంథాలయ సంస్థలకు జమ చేయడం చారిత్రాత్మక నిర్ణయం175 నియోజకవర్గాల్లో గ్రంథాలయాల ఏర్పాటుకు చర్యలు స్వాగతించదగినవిగుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ భీమినేని వందనా దేవి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈరోజు అసెంబ్లీలో గ్రంథాలయాల అభివృద్ధికి సంబంధించి చేసిన కీలక ప్రకటనలను హృదయపూర్వకంగా అభినందించారు.అసెంబ్లీలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ గ్రంథాలయ సెస్ ద్వారా వచ్చే నిధులను నేరుగా జిల్లా గ్రంథాలయ సంస్థల ఖాతాలకు జమ చేసే విధంగా చర్యలు తీసుకుంటామని ప్రకటించడం పట్ల చైర్‌పర్సన్ శ్రీమతి భీమినేని వందనా దేవి ప్రత్యేకంగా హర్షం వ్యక్తం చేశారు. గ్రంథాలయాల అభివృద్ధికి అవసరమైన ఆర్థిక వనరులు సకాలంలో అందుబాటులోకి వస్తే, జిల్లా మరియు గ్రామీణ ప్రాంతాల్లోని గ్రంథాలయాలను మరింత మెరుగైన స్థాయిలో అభివృద్ధి చేయడానికి అవకాశం ఏర్పడుతుందని ఆమె పేర్కొన్నారు. అదేవిధంగా రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో గ్రంథాలయాలను ఏర్పాటు చేయడం, ఇప్పటికే గ్రంథాలయాలు ఉన్న ప్రాంతాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం వంటి అంశాలపై మంత్రి చేసిన ప్రకటనలు రాష్ట్రంలో గ్రంథాలయ ఉద్యమానికి నూతన దిశను చూపిస్తున్నాయని ఆమె అన్నారు.ప్రతి నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉండే ఆధునిక గ్రంథాలయాలు ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థులు, నిరుద్యోగ యువత, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు, పాఠకులు, పరిశోధకులు ఎంతో ప్రయోజనం పొందుతారని భీమినేని వందనా దేవి తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన పుస్తకాలు, వార్తాపత్రికలు, పత్రికలు, డిజిటల్ వనరులు మరియు ప్రశాంతమైన చదువుకునే వాతావరణం అందించడంలో గ్రంథాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.అలాగే గ్రంథాలయాల అభివృద్ధి బాధ్యతను గ్రంథాలయ సంస్థల చైర్‌పర్సన్‌లు మరియు సంబంధిత బాధ్యులపై ఉంచి, వాటి పనితీరును మెరుగుపరచాలని మంత్రి సూచించడం కూడా స్వాగతించదగిన పరిణామమని ఆమె అన్నారు. ప్రజలకు మరింత మెరుగైన గ్రంథాలయ సేవలు అందించేందుకు చైర్‌పర్సన్‌లు, అధికారులు మరియు సిబ్బంది సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.గ్రంథాలయాలను కేవలం పుస్తకాలు చదివే ప్రదేశాలుగా కాకుండా, విద్య, విజ్ఞానం, ఉపాధి, పోటీ పరీక్షల తయారీ, డిజిటల్ విద్య మరియు యువత అభివృద్ధికి కేంద్రాలుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని భీమినేని వందనా దేవి అభిప్రాయపడ్డారు.ముఖ్యంగా గ్రంథాలయ సెస్ నిధులను నేరుగా జిల్లా గ్రంథాలయ సంస్థలకు అందించడం వల్ల స్థానిక అవసరాలకు అనుగుణంగా నిధులను వినియోగించి గ్రంథాలయ భవనాలు, ఫర్నిచర్, పుస్తకాలు, కంప్యూటర్లు, డిజిటల్ సదుపాయాలు, తాగునీరు, మరుగుదొడ్లు, పఠన మందిరాలు తదితర మౌలిక వసతులను మరింత మెరుగుపరచడానికి అవకాశం కలుగుతుందని ఆమె తెలిపారు.రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉండే ఆధునిక



గ్రంథాలయం ఉండాలన్న ప్రభుత్వ లక్ష్యం సాకారం కావాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో గ్రంథాలయ రంగం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నాను. గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న ప్రతి నిర్ణయానికి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ తరపున సంపూర్ణ సహకారం అందిస్తాము" అని చైర్‌పర్సన్ భీమినేని వందనా దేవి తెలిపారు.గ్రంథాలయాల బలోపేతానికి ప్రభుత్వం చూపిస్తున్న ప్రత్యేక శ్రద్ధ పట్ల ముఖ్యమంత్రి కి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ భీమినేని వందనా దేవి ప్రత్యేక కృతజ్ఞతలు మరియు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

# ఫొటోగ్రఫీ అద్భుతమైన కళ : కలెక్టర్ డా. లక్ష్మీశ



**విజయవాడ, పెన్ పవర్,ఆగస్టు 19:**
ఒక ఛాయాచిత్రం వెయ్యి మాటల భావాన్ని వ్యక్తపరుస్తుందని, ఒక క్షణాన్ని శాశ్వతంగా బంధించి భావోద్వేగాలు, సంఘటనలు, చరిత్రను భావితరాలకు అందించే అద్భుతమైన కళ ఫొటోగ్రఫీ అని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లూయిస్ డాగ్యురే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ సమాజంలోని భావోద్వేగాలు, సంస్కృతి, అభివృద్ధి, ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించడంలో ఫొటోగ్రఫీ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ముఖ్యమైన సంఘటనలను ప్రజలకు చేరవేయడంలో ఫొటో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు.ఫొటో జర్నలిస్టుల ప్రతిభను



ప్రోత్సహించేందుకు ఏటా జిల్లాస్థాయిలో ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో వీడియో జర్నలిస్టులు, అమెచ్యూర్ ఫొటోగ్రాఫర్లను కూడా పోటీల్లో భాగస్వామ్యం చేస్తామని చెప్పారు. 27 మంది విజేతలకు నగదు బహుమతులు ఆంధ్రప్రదేశ్ సంస్కృతి, వారసత్వం, పర్యాటకం, యువత, పీ4, ఆర్థిక అభివృద్ధి, సంక్షేమం, ఉత్తమ న్యూస్ పిక్చర్స్ విభాగాల్లో నిర్వహించిన పోటీలకు మొత్తం 221 ఛాయాచిత్రాలు అందాయి. జ్యూరీ సభ్యులు 27 ఉత్తమ ఛాయాచిత్రాలను ఎంపిక చేశారు. విజేతలకు కలెక్టర్ నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేసి సత్కరించారు.ఈ సందర్భంగా ఆర్‌డీవో వెన్నెల శ్రీను మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమంతో పాటు సంస్కృతి, కళలు, వారసత్వానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఐ అండ్ పీఆర్ ఆర్‌జేడీ పి.తిమ్మప్ప మాట్లాడుతూ జర్నలిస్టులు అక్షర సైనికులైతే, ఫొటోగ్రాఫర్లు దృశ్య సైనికులని అభివర్ణించారు. కార్యక్రమంలో ఫొటోగ్రఫీ పోటీల్లో బహుమతులు పొందిన ఛాయాచిత్రాలతో ఏర్పాటు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. సీనియర్ ఫొటోగ్రాఫర్ పొట్లూరి ప్రసాద్ సేకరించిన అరుదైన, వివిధ రకాల కెమెరాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో అధికారులు, ఫొటో జర్నలిస్టులు, స్టూడియో ఫొటోగ్రాఫర్లు, ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు పకడ్బందీగా ముందస్తు చర్యలు



**బాపట్ల( పెన్ పవర్), ఆగస్టు 19:**
స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఎలక్టోరల్ రోల్ ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా, పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునీత్ సూచించారు. బుధవారం రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల ముందస్తు చర్యలపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు, జిల్లా పరిషత్‌లు, మండల పరిషత్‌లు, ఇతర స్థానిక సంస్థల ఎన్నికలకు ముందస్తు చర్యలు ఎంతో కీలకమన్నారు. ఎన్నికలకు ముందు చేపట్టాల్సిన కార్యక్రమాలు, ఎన్నికల ప్రక్రియపై సంబంధిత అధికారులకు వివరించారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని, బ్యాలెట్ బాక్సుల ప్రస్తుత పరిస్థితిపై నివేదిక సమర్పించాలని సూచించారు.సున్నిత, అతి సున్నిత పోలింగ్ కేంద్రాలను గుర్తించి వాటి వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లపై దృష్టి సారించాలని సూచించారు. స్థానికంగా సమకూర్చుకోవాల్సిన ఎన్నికల సామగ్రి, రాష్ట్ర స్థాయి నుంచి రావాల్సిన సామగ్రి జాబితాపై అధికారులకు స్పష్టమైన అవగాహన ఉండాలన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని ముందుగానే సమకూర్చుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియపై అధికారులకు శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి. మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి బ్యాలెట్ బాక్సులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. చీరాల, వేటపాలెంకు సంబంధించి కోర్టు కేసులు పూర్తయ్యాయని, బాపట్లకు సంబంధించి తీర్పు వెలువడాల్సి ఉందన్నారు. ఎన్నికల నిర్వహణపై ఎంపీడీవోలకు శిక్షణ ఇవ్వాలని పేర్కొన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి లవన్న, జిల్లా పంచాయతీ అధికారి కే. ప్రభాకర్, బాపట్ల, చీరాల, రేపల్లె మున్సిపల్ కమిషనర్లు హాసిని, డానియల్ జోసెఫ్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

# కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి

**మూడు రోజుల పాటు విధులు బహిష్కరించిన మడకశిర న్యాయవాదులు**



**మడకశిర, పెన్ పవర్ ఆగస్టు 19:**
కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ మడకశిర న్యాయవాదులు మూడు రోజుల పాటు విధులను బహిష్కరించారు. న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 19, 20, 21 తేదీల్లో విధుల బహిష్కరణ కార్యక్రమాన్ని చేపట్టారు.కర్నూలులో కేవలం మొబైల్ కోర్టు లేదా సర్క్యూట్ బెంచ్ ఏర్పాటు చేయడం కాకుండా, శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. రాయలసీమ ప్రజలు, న్యాయవాదులు, మేధావుల చిరకాల ఆశయం, ఆకాంక్ష అయిన శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటుతో రాయలసీమ ప్రజలకు కొంతవరకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.రాష్ట్ర విభజన సమయంలో రాయలసీమ ప్రాంతం తీవ్రంగా నష్టపోయిందని, ప్రాంతీయ సమతుల్యత సాధించేందుకు కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని న్యాయవాదులు తెలిపారు. ఈ అంశంపై ప్రభుత్వం వెంటనే స్పందించి స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం స్పందించని పక్షంలో ఉద్యమాన్ని ప్రజల ముందుకు తీసుకెళ్లి ప్రజాస్వామ్య పద్ధతిలో దశలవారీగా తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేసే వరకు ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, మేధావులతో కలిసి ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు అశ్వత్థ నారాయణ, సీనియర్ న్యాయవాదులు సి.కె. నాగేగౌడ్, జి. రాధాకృష్ణ, వై.సి. గోవర్ధన్ రెడ్డి, సి.ఎన్. శ్రీనివాసులు, రాజన్న, ఉమేష్ చంద్ర, గోపాల్ రావు, విజయ భాస్కర్, హనుమంత రాయుడు, రవికుమార్, నరసింహమూర్తి తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో

## బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు హర్షణీయం



**అమరాపురం, పెన్ పవర్ ఆగస్టు 19:**
రాష్ట్రంలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని అమరాపురం మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) అధ్యక్షులు ఎన్. గణేష్ అన్నారు. బుధవారం అమరాపురం మండల పీఏసీఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ.. బీసీ వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం పెంచాలన్న ఆకాంక్షకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం బలాన్నిస్తుందన్నారు. గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం రిజర్వేషన్లు కల్పించడం అభినందనీయమన్నారు.

ఈ రిజర్వేషన్లతో స్థానిక సంస్థల్లో బీసీలకు మరింత రాజకీయ సాధికారత లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. జనాభాలో గణనీయమైన వాటా కలిగిన బీసీ వర్గాలకు ఈ నిర్ణయం సామాజిక న్యాయం దిశగా కీలక ముందడుగు అని అన్నారు. బీసీల అభ్యున్నతికి ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి బీసీ వర్గాల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.ఈ సమావేశంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సహకార సంఘం సభ్యులు, బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రెండు దశాబ్దాలుగా 'జనహిత వాత్సల్యకు' అండగా

## ఎంపీ వేమిరెడ్డి ఈ ఏడాది కూడా రూ.5 లక్షల విరాళం అందజేత

## 20 ఏళ్లలో మొత్తం రూ.1 కోటి విరాళం



**నెల్లూరు పెన్ పవర్ ఆగస్టు 19.**
నెల్లూరు, కొండాయపాళెం రోడ్డులో నిరాధార బాలబాలికలు, వృద్ధుల సంరక్షణ కేంద్రం జనహిత వాత్సల్యకు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గత 20 సంవత్సరాలుగా నిరంతరం అండగా నిలుస్తున్నారు. నిరాధార బాలబాలికలు, వృద్ధుల సంరక్షణకు అవసరమైన ఖర్చుల నిమిత్తం ప్రతి సంవత్సరం ఆగస్టులో రూ.5 లక్షల చొప్పున విరాళంగా అందిస్తూ వస్తున్నారు. ఈ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం సాయంత్రం ఎంపీగారు ఈ ఏడాదికి సంబంధించిన రూ.5 లక్షల చెక్కును జనహిత వాత్సల్య సంఘటన కార్యదర్శి జీవీ సాంబశివరావు అందజేశారు. గత రెండు దశాబ్దాలుగా ప్రతి సంవత్సరం రూ.5 లక్షల చొప్పున అందించిన విరాళాలతో ఇప్పటి వరకు మొత్తం రూ.1 కోటి ఆర్థిక సహాయాన్ని జనహిత వాత్సల్య సంస్థకు అందించినట్లయింది.అదేవిధంగా, అమరావతి ఛాంపియన్‌షిప్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు జనహిత వాత్సల్యకు చెందిన భరత్, ధన్విత్ బాలుర జట్టులో, శీనమ్మ, హేమలత బాలికల జట్టులో నెల్లూరు జిల్లా హాకీ జట్టుకు ఎంపికైనట్లు సంఘటన కార్యదర్శి, ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచి జిల్లా హాకీ జట్టుకు ఎంపికైన వాత్సల్య పిల్లలను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అభినందించారు.ఈ సందర్భంగా జనహిత వాత్సల్య సంఘటన కార్యదర్శి జీవీ సాంబశివరావు మాట్లాడుతూ, నిరాధార బాలబాలికలు, వృద్ధుల సంరక్షణ కోసం గత 20 సంవత్సరాలుగా నిరంతరంగా ఆర్థిక సహాయం అందిస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. రెండు దశాబ్దాలుగా ప్రతి సంవత్సరం సంస్థకు అండగా నిలవడం ఆయన సేవా దృక్పథానికి, మానవతా విలువలకు నిదర్శనమని పేర్కొన్నారు. ఎంపీ అందిస్తున్న సహాయం ఎంతో విలువైనదని, ఈ నిరంతర సహకారం జనహిత వాత్సల్య సంస్థ సేవలను మరింత సమర్థవంతంగా కొనసాగించేందుకు ఉపయోగపడుతోందని తెలిపారు